
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





# వలస పక్షులు

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

**" ఈ వెంచర్ బావున్నట్టుంది చూడు, రాణీ ! "** ఒక ప్రకటన వైపు చూస్తూ అన్నాడు వెంకట్, భార్య రాణితో.

రియల్ ఎస్టేట్‌కి సంబంధించిన ఒక ప్రదర్శనలో ఉన్నారు వాళ్ళిద్దరూ. గత ఆరునెలలుగా ఇల్లు కొనాలని వాళ్ళ ప్రయత్నం. ఆ ఆలోచన రావడం తడవు, కనిపించిన ప్రతీ ప్రోజెక్ట్‌నీ చూసి రావడం, ఒకటి బావుంటే, మరొకటి కుదరక వదిలేయడమూ జరుగుతోంది గత నాలుగు నెలలుగా..

" ఇలా అయితే లాభం లేదమ్మాయీ!.. ఈ మహానగరంలో ఇల్లు దొరకడమే గగనం, ఇంక రాణీ గారి హిరణ్యాక్షవరాలన్నీ దొరకాలంటే మరి, మన ఈ జీవితంలో కుదరడం కష్టమే" అని ఏడిపించడం మొదలు పెట్టాడు వెంకట్.

"మనమేమీ పెద్ద పేలస్‌లు కొనడం లేదు. మనం చూసే రెండో , మహా ఐతే మూడో బెడ్ రూముల ఇంట్లో ఏమంత పెద్ద విశేషాలు ఏముంటాయి? ఏ బిల్డర్ అయినా ఇందులో చూపించే పెద్ద ప్రత్యేకతలేమీ ఉండవు, మనకి కావలసిన ఏరియా, గాలీ, వెలుతురూ, నీళ్ళూ ఉంటే చాలు " అని వెంకట్ అభిప్రాయం.

రాణికి అలా కాదు.. ఇల్లు ప్లాన్ చూడగానే ఏ సామాను ఎక్కడ పెట్టుకోవాలో మనసులోనే అంచనా వేసేసుకుంటుంది, దానిలో ఏ చిన్న తేడా వచ్చినా ఆమెకి ఎంతో చిరాకు. పైగా, షాపింగ్ కాంప్లెక్స్‌లకి, బస్ స్టాప్ కి ఎంత దూరం? రైల్వేస్టేషన్ ఎంత దూరం? ముఖ్యమైన మార్కెట్‌లు ఎంత దూరం, ఇలాంటి విషయాలే కాదు, చుట్టుపక్కల పార్కులున్నాయా? బయటకి కనిపించే ఎలివేషన్ ఎలా ఉంది? ఇలా ఎన్నో రకాలు ఆలోచిస్తుంది. పైగా వాస్తు ఒకటి. ముఖ ద్వారం ఇటు ఉండాలి, ఈ ఇంట్లో అది సరి లేదు, ఇది సరిలేదు అని లక్ష వంకలు పెడుతుంది. ఇలా రకరకాల కారణాల వల్ల రాణికి నచ్చక, రాణికి ఏదైనా ఒకటి నచ్చితే అందులో వెంకట్‌కి ఏదో కారణాన నచ్చక, ఇలా వాళ్ళ ఇళ్ళ వేట కొనసాగుతూనే ఉంది.

దానివల్ల ఈ మధ్యన వాళ్ళ వారాంతాలన్నీ దాదాపుగా ఈ పనితోనే సరిపోతోంది. అందుకే ఈ సారి ఈ ఎక్జిబిషన్‌కి వచ్చేముందే చెప్పేశాడు. "ఇంక ఇళ్ళపేరుతో తిరగడం నావల్ల కాదు, ఈ రోజు ఏదైనా దొరికిందా సరే లేకపోతే అంతే.. ఇంకా ఎక్కువ మాట్లాడితే మీ తాతగారి ఊర్లో కట్టుకోవడమే "అని.

" ఇది బావుంది.. రేపే వెళ్ళి చూసి వద్దాం" సంతోషంగా అంది రాణి.

" అమ్మయ్యా! ఇప్పటికొకటి నచ్చింది కదా! రేపటిదాకా ఎందుకు? ఈ రోజే వెళదాం " అన్నాడు అతను. మళ్ళీ ఆలస్యం అయితే తన మనసు మారిపోతుందేమో అన్న భయంతో.

సాయంత్రం సైట్ విజిట్‌కి వెళ్ళారు. మరీ ఎక్కువ కాకుండా వంద ఫ్లాట్‌లు ఉన్న ప్రోజెక్ట్ అది. ఇప్పుడే డెవలప్ అవుతున్న ఏరియాలో ఉండడం వల్ల చుట్టుపక్కల పొలాలూ, చెట్లూ ఉండి ఆకుపచ్చని ప్రకృతి ఆహ్లాదంగా ఉంది.. అదే రాణికి చాలా నచ్చింది.

బిల్డింగ్ చాలా భాగం తయారయింది. లోపల గోడలు కడుతున్నారు. మోడల్ ఫ్లాట్ చూసారు.. రాణి దాన్ని చూస్తూనే ఇది ఇక్కడ, అది ఆ మూల అంటూ మొదలు పెట్టింది. ఎనిమిదో అంతస్థులో భవంతి వెనక వైపునున్న ఒక ఫ్లాట్ రాణికి చాలా నచ్చింది.

" వెంటనే మాట్లాడేయండి, ఫైనలైజ్ చేసేద్దాం.. " అంటూ కంగారు పెట్టింది వెంకట్‌ని.

"ఇదే నీతోటి వచ్చిన చిక్కు. ఏదీ ఓ పట్టాన నచ్చదు, నచ్చిందంటే ఒక్క నిమిషం ఆగలేవు.. అంతలా ఏముంది ఆ ఫ్లాట్లో" అన్నాడు నవ్వుతూ.

రాణి నవ్వలేదు.. చెయ్యి ఎత్తి ఎదురుగా చూపించింది.

తనకి నచ్చిన ఫ్లాట్ లో పెద్ద బెడ్‌రూంకి ఆనుకుని ఉన్న బాల్కనీలో నిలుచుని ఎదురుగా కనిపిస్తున్న పెద్ద చెట్టుని చూస్తోంది.

అదొక బాదం చెట్టు. చాలా పెద్దగా, విశాలంగా విస్తరించి ఉంది. పక్కనున్న స్థలంలో ఉన్నా దాని కొమ్మలు బాగా విస్తరించుకుని ఈ అపార్ట్‌మెంట్ లో వెనకవైపున ఉన్న చాలా ఫ్లాట్‌ల బాల్కనీలని తాకుతున్నాయి.. అంతేకాదు.. ఇటువైపు ఉన్న కొమ్మల్లో చాలా పక్షుల గూళ్ళు ఉన్నాయి.. అది రాణికి ఇంకా నచ్చింది.

"నీకు నచ్చినది ఈ చెట్టా? ఇల్లా? "అనుమానంగా అడిగాడు వెంకట్.

"చెట్టే, "అంది గట్టిగా, మళ్ళీ మెల్లిగా "ఇల్లూ, ఇంటి పక్కనే ఉన్న చెట్టు.. " అంది.

"తొందరగా నడవండి.. మాట్లాడదాం వాళ్ళతో".. అంటూ కంగారు పెట్టింది.

రాణి పుట్టిందీ, పెరిగిందీ విజయవాడ దగ్గరున్న పల్లెటూర్లో. ఊరిలో వాళ్ళదే పెద్ద ఇల్లు..అంత పెద్ద ఇంట్లో పెరిగిన ఆ అమ్మాయికి ముందు ఫ్లాట్లో ఉండగలమా అన్న ఆలోచన కూడా ఇళ్ళు నచ్చకపోవడానికి మరొక కారణం.

పల్లెటూళ్ళో వాళ్ళ ఇల్లు చాలా పెద్దది. పెద్ద కాంపౌండ్ , చుట్టూ చెట్ల మధ్య బొమ్మరిల్లులా ఉండేదా పెద్ద పెంకుటిల్లు. సపోటా, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, అరటి, దానిమ్మ లాంటి పండ్ల చెట్లూ, గులాబీ, మందార, నంది వర్ధనం లాంటి ఎన్నో పూల మొక్కలూ ఉండేవి. బయట ఎంత ఎండ ఉన్నా ఇంట్లో తెలిసేది కాదు. ఇంటి వెనక రెండు మామిడి చెట్లుండేవి. వాటి పక్కన కొద్ది దూరంలో ఉండేది బాదం చెట్టు. ఇంచుమించు ఇంటినంతా తన గొడుగు నీడలో దాచుకున్నట్టుగా ఉండేదా చెట్టు. చాలా పెద్దది.. దాని మీద ఎన్నో పక్షులు, నిత్యం ఉండేవి కొన్నయితే, సంవత్సరంలో కొన్ని నెలలకి మాత్రం వలస వచ్చి గూళ్ళు కట్టుకుని.. గుడ్లు పెట్టి, వాటిని పొదిగి, అవి పిల్లలయ్యేదాకా ఉండి మళ్ళీ వచ్చిన చోటికి వెళ్ళిపోయే పక్షులు మరికొన్ని..

తెల్లవారితే వాటి కిలకిలా రావాలతో రాణి వాళ్ళ ఇల్లు మేలుకునేది. రాణి వాళ్ళది ఉమ్మడి కుటుంబం. రాణి వాళ్ళు, వాళ్ళ బాబాయ్‌లు ఇద్దరూ, తమ కుటుంబాలతో కలిసి ఉంటారు. రాణి వాళ్ళ నానమ్మా, తాతగారూ ఎంతో ముచ్చటపడి కట్టించుకున్న ఆ ఇల్లంటే ఇంట్లో అందరికీ ప్రాణం. రాణికీ, తన తమ్ముడు విజయ్, ఆమె కజిన్స్‌కీ ఆ బాదం చెట్టు అంటే ఎంతో ఇష్టం.

పొద్దున్నే నిద్ర లేచినదగ్గరనించీ దానిమీదకి రోజుకెన్ని ఉడతలూ, చిలకలూ వస్తాయో లెక్కపెట్టడం, బాదం కాయలు ఎప్పుడు రాలతాయో అని ఎదురుచూడటం వాళ్ళకెంతో సరదాగా ఉండేది. వలససీజన్‌లో వచ్చే కొత్త పక్షులకోసం ప్రతీ సంవత్సరమూ చుట్టాలకోసం ఎదురుచూసినట్టు చూసేవారు. ప్రతీ ఆదివారమూ దాని కింద ఉన్న అరుగు మీద కూర్చునే పిల్లలందరూ వంటికి నూనె రాసుకుని నలుగు పెట్టుకుని పక్కనే ఉన్న బాత్ రూంలో స్నానాలు చేసేవారు. ఇంకా ఎన్నో రకాలుగా వాళ్ళ జీవితంతో పెనవేసుకుపోయింది.

దాని పెద్ద కొమ్మకి కట్టిన గొలుసుల ఉయ్యాల మీద పిల్లలు వంతుల వారీగా ఊగేవారు. ప్రతీ శనివారం రాణి వాళ్ళ బామ్మ బెల్లం, పాలూ వేసి కమ్మగా బియ్యం పరమాన్నం వండి, వెంకటేశ్వరస్వామికి నైవేద్యం పెట్టి చక్కగా కడిగిన బాదం ఆకుల్లో పెట్టేది. దాని రుచి ఇదీ అని చెప్పడం కష్టం. అందుకే శనివారం ఎప్పుడొస్తుందా ? అని పిల్లలందరూ ఆశగా ఎదురు చూసేవారు.

స్కూల్ నించి రాగానే చెట్టు కింద కట్టిన అరుగుమీదే కూర్చుని అన్నాలు తినేవారు. కాయలు కిందపడితే రాయి పెట్టి కొట్టి పప్పులన్నీ అందరికీ సమానంగా పంచేవారు వాళ్ళ తాతయ్య. దానికున్న తొర్రలో ఒక ఉడుతల జంట ఉండేది.. అవి ఒకదాని వెనక మరొకటి అల్లరల్లరిగా పరుగెడుతూ సందడి చేస్తుండేవి. అలా వెళ్ళినప్పుడల్లా, ఓ చిన్న జాంకాయో, సగం కొరికిన బాదం పప్పో తెచ్చుకుని తొర్రలో దాచుకునేవి. వాటికి లక్ష్మి, శీను అని పేర్లు పెట్టుకున్నారు. "రాములవారు నీ వీపు మీద గీతలు గీసారు కదమ్మా అని లక్ష్మినీ, ఎంత అదృష్టమో "అని శీనుని బామ్మ పలకరిస్తూ ఉండేది. ఆవిడ ప్రతీ ఆది వారం బాదం ఆకులు కలిపి కుట్టుకున్న విస్తరాకులోనే అన్నం తినేది, ఆరోగ్యానికి మంచిది అని. పిల్లలందరూ గొడవ చేస్తే అప్పుడప్పుడు వాళ్ళకీ పనివాడితో కుట్టించి ఆ ఆకుల్లోనే అన్నం పెట్టేది.

దాని మూల కొమ్మ మీద కోకిలలు ఉండేవి.. అవి వసంత కాలం లో కూ కూ అని అరిస్తే పిల్లలందరూ వెంట వెంటనే అరిచి గోల చేసేవారు. ' ఛీ! .. వెధవ కాకి గోల ' అని తిట్టుకున్నా సరే, కాకులూ అక్కడే ఉండేవి. ఎర్రని ముక్కులతో అందంగా మెరిసిపోయే రామచిలుకలూ , గోరింకలూ, పిచుకలూ ఇలా ఎన్నో పక్షులు చెట్టుమీద తలో కొమ్మనా ఉండేవి.

"ఒక్క చెట్టుమీద అన్ని రకాల పక్షులు ఎంత బాగా కలిసి మెలిసి ఉంటాయో కదమ్మా! చూడటానికే ఎంత బావుంటుందో, ఎక్కడెక్కడనించి వస్తాయో, ఇదే వాళ్ళుండే చెట్టని ఎలా తెలుసుకుంటాయో, ఎవరన్నారు? వీటిని చిన్న ప్రాణులని? ఎంతో తెలివైనవి నిజానికి " అనేది వాళ్ళ అమ్మతో చెట్టు మొదట్లో పెట్టిన వెదురు బేసిన్ లో బియ్యం వేస్తూ.

ఈ విషయాలన్నీ దారిపొడుగునా వెంకట్‌కి చెప్తూనే ఉంది రాణి. ఆ చెట్టంటే తనకెంత ప్రాణమో, తనకే కాదు తన తమ్ముడు విజయ్, కజిన్స్ చిట్టీ, సీమా, రాధ, బాబీ, అజయ్ , వసంతా.. వీళ్ళందరికీ ఎంత ఇష్టమో, చెప్పినది చెప్పకుండా చెప్పింది.

రాణి స్వతహాగా తక్కువ మాట్లాడుతుంది.. తమ పెళ్ళి అయిన ఈ రెండేళ్ళలో తన భార్య ఇంత మాట్లాడడం చాలా బావుంది అతనికి. దారిలో రెస్టారెంట్లో భోజనానికి ఆర్డర్ ఇచ్చి, రాణి వైపే నవ్వుతూ చూస్తూ తను చెప్పేది వింటున్నాడు.

" మీకు తెలుసా? మా ఊరిలో కాలేజీ లేదనీ, ఎంసెట్ కోచింగ్ కోసం అని నన్ను విజయవాడలో కాలేజీలో చేర్చినప్పుడు నేనెంత ఏడ్చానో ఇల్లు వదిలి వెళ్ళనని..బాదం చెట్టు కింద ఉన్న ఉయ్యాల్లో కూర్చుని చదువుకుంటేనే మంచి మార్కులు వస్తాయని నాకు చాలా నమ్మకం. అందుకనే ఎప్పుడూ దాని మీద నా తడి గౌన్ ఆరేసుకుని వెళ్ళేదాన్ని, మా చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ తడి ఉయ్యాల ఎక్కరని. అదో పిచ్చి. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంత భయపడ్డానో? ఫెయిల్ అయిపోతానేమో అని. నేను మొదటి సారి ఇల్లు వదిలి వెళ్ళినప్పుడు దాని మీద చిన్న స్క్రూడ్రైవర్ తో దాని మొదట్లో నా పేరు చెక్కాను.. అప్పటినించీ మా ఇంట్లో పిల్లలందరూ మొదటిసారి ఇల్లు వదిలి వెళ్ళేటప్పుడు దాని మీద అందరి పేర్లు చెక్కారు. " అంది కళ్ళు తుడుచుకుంటూ.

వాళ్ళ తాతగారు పోయాకా, రాణి తల్లితండ్రులు, బాబాయ్‌లూ వ్యాపారం విస్తరిస్తూ హైదరాబాద్, చెన్నై లాంటి నగరాలకి వెళ్ళిపోయారు. అనుకోకుండా ఒక వ్యాపారం లో నష్టం రావడంతో వేరే దారి లేక, ఇల్లు తాకట్టు పెట్టి అప్పు తెచ్చి వ్యాపారంలో పెట్టారు. ఆ ఇంటిని గురించి తలుచుకున్నప్పుడల్లా, చిన్ననాటి జ్ఞాపకాలు చుట్టుముట్టి ఎమోషనల్ అవుతుంది.

భోజనం వచ్చింది.. ఇద్దరూ మౌనంగా తింటున్నారు.

" మీరు చూశారా? మనం చూసిన ఫ్లాట్ మీదకి పాకిన కొమ్మలో మూడు పక్షుల గూళ్ళు ఉన్నాయి. అచ్చు మా ఇంటి చెట్టులాగే.. " అచ్చు మా చెట్టుని చూసినట్టే ఉంది, కాదు.. ఒక్క మాటలో చెప్పాలంటే మా ఇంట్లోంచి చెట్టుని తెచ్చేసి ఇక్కడ పెట్టేసారేమో అనిపించింది తెల్సా "అంది సంబరంగా.

" సరే.. రేపే వెళ్ళి అడ్వాన్స్ ఇచ్చేద్దాం. మరో ఆరు నెలల్లో అక్కడకే మన మకాం" అన్నాడు నవ్వుతూ బిల్ పే చెస్తూ. రాణి కూడా నవ్వింది. అప్పటినించి 'ఇల్లు ఎప్పుడు పూర్తవుతుందా? అని అని ఎంతో ఆశతో ఎదురుచూసేది. మధ్యలో ఇల్లు చూడటానికి వచ్చిన ప్రతీ సారీ తమ ఇంటికీ, బాదం చెట్టుకీ సంబంధించిన ఏదో ఒక విషయం చెప్తూనే ఉండేది.

అనుకున్నదానికన్నా మూడు నెలలు ఆలస్యం అయినా మొత్తానికి కొత్త ఇంట్లోకి ప్రవేశించారు. ఇల్లు సర్దుకునేదాకా ఉండి, రాణి అమ్మా వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళున్న వారం రోజులూ ముగ్గురికీ బాదం చెట్టు కబుర్లే. వెంకట్‌కి ఓ పక్కన ముచ్చటగా ఉన్నా, ఒక్కోసారి విసుగేసింది కూడా. ఒక్క చెట్టు గురించి ఇంత గోలేమి టా? అని..

మెల్లి మెల్లిగా కొత్త ఇంటికీ, ఏరియాకీ అలవాటు పడుతున్నారు. రాణికి ఆఫీస్ దగ్గరే. పొద్దున్నే ఇద్దరూ కలిసి వెళతారు, సాయంత్రం రాణి తొందరగా వచ్చేస్తుంది.. ఆరూ, ఆరున్నరకి రాగానే వేడిగా కాఫీ చేసుకుని కప్ లో పోసుకుని ఈజీ చెయిర్ లో కూర్చుని మెల్లిగా సిప్ చేస్తూ బాదం చెట్టునీ, కొమ్మలమీదున్న గూళ్ళల్లోని పక్షులనీ చూస్తూ దాదాపు అరగంట తాగుతుంది.

అప్పుడే పెద్దపక్షులు ఇంటికి చేరేవేళ, గూళ్ళల్లో ఉన్న చిన్న పిల్లలు ఆకలితో గోల, గోలగా అరుస్తూ ఉండేవేళ.. ఆ హడావుడీ, వాటి కిల కిలా రావాలు ఇవన్నీ ఎంతో ముచ్చటగా ఉంటాయి ఆమెకి. చీకటి పడ్డాకా వాటి సందడి సద్దుమణిగాకే వంట ప్రయత్నాలు మొదలు పెట్టేది.

బాల్కనీలో రెండు చిన్న చిన్న బౌల్స్ లో బియ్యం, పప్పూ లాంటి గింజలూ, మరొకదాంట్లో నీళ్ళూ పెట్టేది. వాటిని తీసుకోవడానికి ఎప్పుడైనా ఎదైనా ఒక పక్షి వస్తే చిన్నపిల్లలా సంబరపడేది.

"చాలా బావుంది ఇంక కొంచం మా కడుపు నింపే పని కూడా చూస్తారా?" అని వెంకట్ వేళాకోళం చేసేవాడు. అమెరికాలో ఉన్న కజిన్స్ తప్ప మిగతా నలుగురూ, ఆమె తమ్ముడు విజయ్ వివిధ సమయాల్లో వచ్చి వీరింట్లో రెండేసి రోజులుండి, ఆ చెట్టుని చూసుకుని మురిసిపోయి మరీ వెళ్ళారు. ఇదంతా పెద్ద తమాషాలా ఉండేది వెంకట్‌కి.

"ఒక్క చెట్టు ఎన్ని పక్షులకి నివాసం కల్పిస్తోందో, తల్చుకుంటేనే నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. మీకు తెలుసా, మా ఇంట్లోనూ ఇంతే.. ఎన్ని పక్షులుండేవో, ఎంత బావుండేవో" అంది ఒకసారి వెంకట్‌తో.

"అమ్మో, నా ఆడ సలీం ఆలీ, నువ్వదేదో భానుప్రియ సినిమాలోలా ఎప్పుడూ ఈ పక్షులగురించీ, బాదంచెట్టు గురించీ తప్ప మరేదైనా మాట్లాడవా? ఓ సారి ట్రై చెయ్యి "అన్నాడు. పక పకా నవ్వుతూ. అలా పక్షుల కిలకిలా రావాలతోనూ, నవదంపతుల సరససల్లాపాలతోనూ మరో ఏడాది గల గలా గడిచిపోయింది.

ఒకరోజు వెంకట్ ఆఫీస్ నించి వచ్చేసరికి రాణి ఎప్పటిలా బాల్కనీలో కూర్చుని లేదు.. అసలా తలుపే తీసి లేదు. మంచం మీద పడుకుని ఉన్న రాణిని ప్రపంచంలో పదోవింతని చూస్తున్నట్టుగా ఉండిపోయాడు ఒక్క నిమిషం.

"రాణీ, ఏమయింది? వంట్లో బాలేదా? " అన్నాడు ఒక్క ఉరుకులో ఆమె దగ్గరకు వచ్చి నుదిటిమీద చెయ్యి వేసి చూసాడు.

"ప్చ్!, బానే ఉన్నాను. "అంది అటు పక్కకి తిరిగి పడుకుంటూ..

"కాదు ఏదో ఉంది.. చెప్పు. పోనీలే కొంచం టీ తేనా, " అన్నాడు.

" వద్దండీ.. నా మనసేమీ బాలేదు.. " అంది చిన్నగా.

"అదే ఎందుకు? చెప్తే కదా నాకు తెలిసేది? " అన్నాడు..

"నాన్న ఫోన్ చేసారు.. బాబాయ్ వ్యాపారం లో నష్టం వచ్చింది కదా, దానికోసం ఇల్లు, స్థలమూ తనఖా పెట్టి అప్పు తెచ్చారు కదా, ఇప్పుడు అది తీరలేదు సరికదా, ఇల్లు అమ్మేయమని బాగా అప్పులవాళ్ళు వత్తిడి చేస్తున్నారుట.. అమ్మేస్తే కాని తప్పేట్టు లేదు అని ఫోన్ చేసారు.

విజయవాడ లోని ఒక పెద్ద కాలేజీ వారు అక్కడ మరొక బ్రాంచీ, దానికి హాస్టలూ కడదామని మంచి రేటు ఇస్తామనేసరికి, ఇంటినీ, తోటని అమ్మేసి వ్యాపారంలోని నష్టాన్ని భర్తీ చెయ్యడమే కాక అప్పులు తీర్చేద్దామనుకుంటున్నారుట నాన్నా వాళ్ళు.

ఎప్పుడో తాతాగారి నాన్నగారు కట్టిన ఇల్లు, తోటా, మా బాదం చెట్టూ.. "ఆమె కళ్ళల్లో నీళ్ళు..

"అయ్యో, అవునా? ఇంకేమీ మార్గం లేదా? "తనలో తనే అనుకుంటున్నట్టుగా పైకే అన్నాడు.

"అదే అర్ధం కావడం లేదు.. దాదాపు కోటి రూపాయలుందిట అప్పు. ఇది అమ్మితే యాభై లక్షలు వస్తుందిట, మిగతాది ఇంకా ఎక్కడ చూడాలో" అని కూడా అన్నారు. అంది.

ఇది జరిగిన నాలుగు రోజులకి అపార్ట్‌మెంట్ ఆఫీస్ దగ్గర బోర్డ్ పెట్టారు. పక్కనున్న స్థలంలో ఫేజ్ టూ మొదలుపెడుతున్నారని, ప్రీ లాంచ్ ఆఫర్ అనీ ఏవో నోటీస్‌లు.

"చూశారా? మన బిల్డర్ ఏం చేస్తున్నాడో? పక్కన ఇంకో ఫేజ్ కడతారుట, నిన్న ఎదురింటావిడ అంటే నేను సరిగా వినలేదు కానీ," రాణి చాలా కోపంగా అంది.

వెంకట్ ఏం మాట్లాడలేదు.. నోటీస్ వైపేచూస్తూ ఉండి పోయాడు.

"ఏం మాట్లాడరేం? మనందరం కలిసి వెళ్ళి అడగాలి వాళ్ళని. ఎలా కడతారో? " అంది కోపంగా..

"ఏమని అడుగుతావు? " అన్నాడు వెంకట్ నెమ్మదిగా.

" అదేమిటండీ? మీరు కూడా అలా అంటారు? పక్కన మళ్ళీ ఓ వందో, నూట యాభయ్యో ఫ్లాట్ లు కట్టాలి అంటే ఎలా సాధ్యం? మన పక్కనే కట్టాలి, పైగా పక్కనున్న స్థలంలో ఉన్న చెట్లూ, ముఖ్యంగా బాదం చెట్టు, దానిమీదున్న పక్షులూ.. " ఇంక మాట్లాడలేక గిపోయింది.

ఏమీ మాట్లాడలేకపోయాడు వెంకట్ ..

అనుకోకుండానూ, అతి విచిత్రంగానూ రెండు బాదం చెట్లతో పెనవేసుకుపోయిన తన భార్య ఎమోషన్స్‌నే చూస్తున్నాడు.

ఏం చెప్పాలో అతనికి తెలియడం లేదు. తన అమాయకత్వంలోనూ, ఆవేశంలోనూ అలా అంటోంది కానీ, బిల్డర్ ని ఏమని అడగగలరు ఎవరైనా? ఆ స్థలం మీద కానీ, దాన్ని ఎవరైనా కొనుక్కుంటే దానిలో ఏం చెయ్యాలి అన్న దానిమీద కానీ, ఎవరికీ ఏ అధికారమూ ఉండదు కదా, అదే మాట అన్నాడు రాణితో..

రాణి ఏమీ మాట్లాడలేదు..

"అక్కడ ఆ చెట్టు అలా అవుతోంది. ఇక్కడ ఇది ఇలా.. అది నా చిన్నతనపు జ్ఞాపకాలు నాకిచ్చినట్టు ఈ చెట్టు మనకి పుట్టబోయే పాపకో, బాబుకో అలాంటి జ్ఞాపకాలిస్తుందనుకున్నాను, కానీ ఇలా ఏడాదిన్నరలోనే మనకే కాంక్రీటు అడవులు కనిపిస్తాయని అనుకోలేదు.. " అశక్తత ఆమె గొంతులో.

"నువ్వు చెప్పింది నిజమే రాణీ! మనకళ్ళెదురుగా జరుగుతున్నా మనమేమీ చెయ్యలేకపోతున్నాము.. నిజానికి మన ఫ్లాట్లున్న ఈ స్థలంలో ఇంతకుముందు ఏముండేవో? ఏ చెట్లమీద మనం ఇల్లు కట్టుకున్నామో ? అనుకుంటేనే ఎంతో బాధగా ఉంటుంది కదూ!.. రోజు రోజుకీ పెరుగుతున్న నగర జనాభాకి కావలసిన సదుపాయాలన్నీ మనం ఇలా నిర్మించుకుంటున్నవే కదూ.. అవి రోడ్డైనా, మరొకటైనా. ప్రకృతిని ఆరాధించడమూ, గౌరవించడమూ ఈ దశలని దాటి అబ్యూజ్ చేసే స్థాయికి మనం ఎప్పుడో చేరుకున్నాం కదా? దీనికి అంతమెప్పుడో? "

"సంవత్సరంలో కొన్నినెలలు ఎవరినీ ఏ రకంగానూ ఇబ్బంది పెట్టకుండా తమ జీవన కార్యక్రమాలని నిర్వహించుకునేవి వలస పక్షులు.. పొట్ట చేత పట్టుకుని ఉద్యోగాల పేరిట మహానగరాలకి వస్తున్న మనలాంటి వలస పక్షులు, కేవలం వచ్చి ఊరుకోకుండా మన నగరాలని జనారణ్యాలుగానూ, కాంక్రీట్ అడవులుగానూ మార్చేస్తున్నాం.

ఒకప్పుడు ఒక స్థలంలో ఒక ఇల్లుంటే కుటుంబ సభ్యులతో సమానంగా పశుపక్ష్యాదులూ కలిసిమెలిసి ఉండేవి. ఒకరుండాల్సిన చోట నలభై, యాభై కుటుంబాలుండాలి అంటే అక్కడున్నందరినీ బయటకి పంపేయడమే మనం చేస్తున్నది.. అవి పక్షులైనా సరే, పశువులైనా సరే, మొక్కలైనా సరే, మరేదైనా సరే.. " బాధగా అన్నాడు..

"అందరూ అలా అనుకుంటే ఎలా? " అంది బాధగా.. కానీ అంతకంటే ఏం చెయ్యాలో ఆమెకీ తెలియలేదు. అప్పుల్లో పడిన బాదం చెట్టుని తామే కట్టి సొంతం చేసుకునే ఆర్థిక స్థోమత లేదు.. పక్కన జరుగుతున్నది అన్యాయమని చెప్పి ఆపగల మార్గమూ లేదు.. ఏం చెయ్యాలో అర్థం కానట్టు ,ఏం మాట్లాడాలో తెలియనట్టుగా ఉండిపోయారు భార్యాభర్తలిద్దరూ.

●●●

Click here to share your comments on this story